

అనతి కాలంలోనే
ప్రజల మన్ననలు చూరగొన్న
వన్ నేషన్ దినపత్రికను
చదవండి... చదివించండి....

# వన్ నేషన్

RNI NO. APTEL/2010/33523 తెలుగు దినపత్రిక


సంపుటి: 16 సంచిక: 250 ఎడిటర్: కె.యువరాజ్ శనివారం 20-6-2026 పేజీలు: 4 వెల: రూ.3/-

వన్ నేషన్
దినపత్రికను
ఆదరిస్తున్న పాఠకులకు,
ప్రకటనకర్తలకు,
శ్రేయోభిలాషులకు
మా హార్థిక
శుభాకాంక్షలు




- దళిత, గిరిజన, బలహీన వర్గాల నుంచి దేశాన్ని ఏలే నాయకులు కావాలి - ఆరుట్ల స్కూల్లో ఇప్పటికే నో అడ్మిషన్ బోర్డు - గత పదేళ్లలో విద్యా శాఖ విధ్వంసానికి గురైంది - 'యంగ్ ఇండియా స్టూడెంట్ కిట్' పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్, జూన్ 19 (వన్‌నేషన్):** "సోషల్ వెల్ఫేర్ హాస్టళ్లలో చదువుకుని ఇవాళ ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ అధికారులుగా మారిన ముగ్గురిని గవర్నర్‌కి పరిచయం చేశాను. నా సోషల్ వెల్ఫేర్ పిల్లలు దేశాన్ని ఏలే నాయకులు కావాలి. శాస్త్రవేత్తలు కావాలి. ఆనాడు ఒక్క అంబేద్కర్ వస్తేనే ప్రపంచానికి దిక్సూచి అయ్యారు. తెలంగాణ దళిత, గిరిజన, బలహీన వర్గాల నుంచి 100 మంది అంబేద్కర్లు రావాలి. ఆ శక్తి మీలో ఉంది" అని విద్యార్థులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. మన తలరాతలు మారేది కేవలం తరగతి గదుల్లోనేనని, ప్రభుత్వం ఇచ్చే సంక్షేమం కంటే విద్యే ముఖ్యమని నొక్కిచెప్పారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో ప్రభుత్వ, రెసిడెన్షియల్ పాఠశాలల్లో చదువుతున్న 27.50 లక్షల మంది విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన 'యంగ్ ఇండియా స్టూడెంట్ కిట్' పంపిణీ కార్యక్రమం శుక్రవారం ఎల్బీ స్టేడియంలో ఘనంగా జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా హాజరయ్యారు. కిట్ల పంపిణీని గవర్నర్‌తో కలిసి సీఎం రేవంత్ ప్రారంభించారు. గురుకుల పాఠశాల విద్యార్థులకు 22 వస్తువులతో; వసతి గృహ విద్యార్థులకు 10; పాఠశాల విద్యార్థులకు ఏడు వస్తువులతో పంపిణీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధికి రూ.50.73 కోట్లతో గవర్నర్ చేతుల మీదుగా వర్చువల్‌గా శంకుస్థాపనలు జరిగాయి. అందులో రూ.36.65 కోట్లతో వివిధ జిల్లాల్లో మినీ స్టేడియాల నిర్మాణానికి, క్రీడా మౌలిక సదుపాయాలకు శ్రీకారం చుట్టగా.. రూ.14.08 కోట్లతో గచ్చిబౌలి, ఎల్బీ స్టేడియంలో బాలబాలికల క్రీడా శిక్షణకు వివిధ అకాడమీలను వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. "మీ సోదరుడిగా, ముఖ్యమంత్రిగా మీ రేవంతన్న ఉన్నాడు. మీరు చదువుతారా, ఆటలు ఆడతారా.. మీకేం కావాలన్నా నిమిషాల్లో చేసి పెట్టే బాధ్యత నాది. ఉచిత బ్రేక్‌ఫాస్ట్, లంచ్, స్నాక్స్‌తోపాటు భవిష్యత్తులో విద్యార్థులకు ఉచిత రవాణా సౌకర్యాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వమే కల్పిస్తుంది" అని భరోసానిచ్చారు.




## ఉండవల్లిలో నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం.. భారీ ఏర్పాట్లు

**అమరావతి, జూన్ 19 (వన్‌నేషన్):** అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలకు నేడు అమరావతిలో భారీ ఏర్పాట్లు చేశారు. 'యోగాంధ్ర-2026' కార్యక్రమంలో భాగంగా చారిత్రాత్మక ఉండవల్లి గుహల వద్ద ఈ వేడుకలను నిర్వహిస్తున్నారు. వేడుకల సందర్భంగా ప్రముఖ యోగా గురు బాబా రామ్‌దేవ్‌తో కలిసి సీఎం చంద్రబాబు నాయుడు స్వయంగా యోగాసనాలు వేయనున్నారు. ముఖ్యమంత్రి సమక్షంలో జరిగే ఈ ప్రత్యేక యోగా ప్రదర్శనల కోసం అధికారులు ఉండవల్లి గుహల వద్ద భారీ ఎత్తున ఏర్పాట్లు పూర్తి చేశారు. యోగా సాధన ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణాన్ని సాధించడమే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. కేవలం అమరావతిలోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు. నిత్యం యోగా సాధన చేయడం వల్ల శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత, ఆరోగ్యం మెరుగుపడతాయని ఈ సందర్భంగా ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. ఉండవల్లి వేడుకల్లో భాగంగా జరగనున్న ఈ యోగా దినోత్సవానికి ప్రజలు పెద్ద ఎత్తున హాజరుకానున్నారు. ఈ చారిత్రాత్మక వేడుకలను విజయవంతం చేసి, ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో యోగాను భాగం చేసుకోవాలని ప్రభుత్వ అధికారులు, నిర్వాహకులు పిలుపునిచ్చారు.

# మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా మెగా ఇంటీరియర్ డిజైన్ షో ప్రారంభం

- ఈ ప్రదర్శన ఈనెల 21వ తేదీ వరకు ..




**హైదరాబాద్, జూన్ 19 (వన్‌నేషన్):** ఆర్కిటెక్చర్, ఇంటీరియర్ డిజైన్, నిర్మాణ రంగాలలో దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మక ద్వైవార్షిక ప్రదర్శన 'ఐఐఐడీ షోకేస్ ఇన్‌సైడర్ ఎక్స్ 2026'ను నగరంలోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ కేవలం ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాలలో ఒకటి మాత్రమే కాదని, అవకాశాలు, జీవనశైలి, ఆవిష్కరణలు కలిసే ఒక గ్లోబల్ గమ్యస్థానంగా ఎదుగుతుందన్నారు. ఐఐఐడీ షోకేస్ అనేది సరికొత్త ఇంటీరియర్ ఉత్పత్తులు, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలు, గ్లోబల్ డిజైన్ ట్రెండ్‌లను ఒకే చోటకు తెచ్చే ఒక శక్తివంతమైన వేదికగా నిలుస్తుందన్నారు. ఇది కేవలం ఒక ప్రదర్శన మాత్రమే కాదని, నిర్మాణ రంగ సౌందర్యాన్ని, పని తీరును, స్థిరత్వాన్ని పెంపొందించడానికి ఒక ఉత్ప్రేరకం లాంటిదన్నారు. ఆర్కిటెక్ట్‌లు, ఇంటీరియర్ డిజైనర్లు, డెవలపర్లు, బిల్డర్లు, ఇళ్ల యజమానులకు కూడా ఒక అవగాహనను అందిస్తుందన్నారు. ఈ పరిశ్రమ ఎటు వైపు వెళ్తుంది? ప్రపంచంలోని ప్రముఖ నగరాల సరసన హైదరాబాద్ తనను తాను ఎలా నిలుపుకుంటోంది అని తెలుసుకోవాలనుకునే వారెవ్వరూ ఈ ఈవెంట్‌ను మిస్ కావద్దన్నారు.

ఈ సందర్భంగా కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి మాట్లాడుతూ ఒక ఆర్కిటెక్ట్‌గా, ఒక ఎమ్మెల్యేగా నిర్మాణ రంగ భవిష్యత్తును తీర్చిదిద్దుతున్న తోటి నిపుణుల మధ్య ఉండటం ఎంతో సంతోషంగా ఉందన్నారు. మన నిపుణులు, వ్యాపారులు అంతర్జాతీయ పురోగతితో, సరికొత్త పోకడలతో నిరంతరం అనుసంధానమై ఉండేలా చూస్తూ, ఈ పరిశ్రమకు అన్ని విధాలా మద్దతు ఇవ్వడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఆవిష్కరణలకు, అద్భుతమైన డిజైన్‌కు, పట్టణాభివృద్ధికి ఒక బెంచ్‌మార్క్‌గా నిలపగలమని చెప్పారు. ఈ సందర్భంగా ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంటీరియర్ డిజైనర్స్ ప్రెసిడెంట్ ఆర్కిటెక్ట్ జిగ్నేష్ మోడీ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా పదకొండు వేల మందికి పైగా ఆర్కిటెక్ట్‌లు, ఇంటీరియర్ డిజైనర్లు, పరిశ్రమ నిపుణులను ఒకే చోటకు చేర్చే దేశంలో అగ్రగామి డిజైన్ సంస్థలలో ఐఐఐడీ ఒకటన్నారు. రాబోయే మూడు రోజులు ఈ ఎక్స్‌పోను సందర్శించి, డిజైన్ రంగ భవిష్యత్తును స్వయంగా అనుభవించాల్సిందిగా కోరారు. డిజైనర్లుగా మన బాధ్యత అందమైన ఇంటీరియర్స్, సౌకర్యవంతమైన ప్రదేశాలను సృష్టించడానికే పరిమితం కాలేదన్నారు. మనం అనుభూతులను డిజైన్ చేస్తామని చెప్పారు. మానవ ప్రవర్తనను ప్రభావితం చేస్తూ, వారి శ్రేయస్సును పెంపొందిస్తూ ప్రజలు నివసించే, పని చేసే, అభివృద్ధి చెందే వాతావరణాన్ని మనం తీర్చిదిద్దుతామన్నారు. డిజైనర్లు జీవన ప్రమాణాలను పెంచే నిశ్శబ్ద శిల్పులు అన్నారు. ప్రతి పౌరుడిపై, సమాజంపై మన పనితీరు చెరగని ముద్ర వేస్తుందన్నారు.

ఈ సందర్భంగా ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంటీరియర్ డిజైనర్స్ హైదరాబాద్ రీజినల్ చాప్టర్ చైర్‌పర్సన్ ఆర్కిటెక్ట్ ఎన్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ఈ రోజు మనందరికి ఎంతో గర్వకారణమైన రోజన్నారు. మనం 'ఇన్‌సైడర్ ఎక్స్' 6వ ఎడిషన్‌ను ప్రారంభించడమే కాకుండా, ఇండియన్ డిజైన్ రంగం సాధించిన అద్భుతమైన ప్రగతిని కూడా ఇక్కడ జరుపుకుంటున్నామని తెలిపారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంటీరియర్ డిజైనర్స్ - హైదరాబాద్ రీజనల్ చాప్టర్ (ఐఐఐడీ హెచ్‌ఆర్సీ) ఆధ్వర్యంలో ఈనెల 21 వరకు జరగనున్న ఈ మూడు రోజుల ప్రదర్శనలో భారతీయ డిజైన్, సరికొత్త సాంకేతికతలను చాటి చెప్తూ 150 పైగా ఎగ్జిబిటర్లు,

4లో

వన్ నేషన్
RNI NO. APTEL/2010/33523 తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

అసలైన అక్షర జ్ఞానాన్ని తెలియజేస్తూ విలువలతో కూడిన జీవన శైలిలో ప్రేరణ కలిగించే విషయాలపై అవగాహన కలిగిస్తూ ప్రజల పక్షాన నిలబడాలని అనుకుంటున్నారా?



బాధ్యతయుతమైన జర్నలిజంలో రాణించాలనుకుంటున్నారా?

అయితే రండి...



తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా జిల్లాలు, మండలాల వారీగా పనిచేసే విలేకరులు కావలెను.

9948222240

# ప్రత్యేక బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలి : దుండ్ర కుమారస్వామి

**హైదరాబాద్, జూన్ 19 (వన్‌నేషన్):** దేశవ్యాప్తంగా బీసీల సమస్యల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం వెంటనే ప్రత్యేక బీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి డిమాండ్ చేశారు. కాచిగూడలో నిర్వహించిన కుల సంఘాల అఖిలపక్ష సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ దళ్ దక్షిణ రాష్ట్రాల కోఆర్డినేటర్ సత్తార్ కుర్మారావు, యాదవ సంఘం నాయకుడు మణి యాదవ్, మహిళా విభాగం నాయకులు తదితరులు పాల్గొన్నారు. దశాబ్దాలుగా బీసీలు ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో వెనుకబడటానికి కేంద్ర ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరే ప్రధాన కారణమని కుమారస్వామి విమర్శించారు. ఎన్నో ఏళ్ల పోరాటం అనంతరం కూడా జనగణనలో ఓబీసీ కులాల వారీగా లెక్కింపు చేపట్టకపోవడం బీసీల పట్ల అన్యాయమని పేర్కొన్నారు. అదే విధంగా ప్రత్యేక బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయకపోవడం కూడా కేంద్రం



నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు. ప్రత్యేక బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు, జనగణనలో కుల గణన సాధించే వరకు ఉద్యమం ఆగదని కుమారస్వామి స్పష్టం చేశారు. అవసరమైతే జాతీయ స్థాయిలో ఉద్యమాన్ని ఉద్ధృతం చేసి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని తెలిపారు. బీసీలు రాజకీయంగా బలోపేతం అయినప్పుడే వారి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. సత్తార్ కుర్మారావు ఆధ్వర్యంలో త్వరలో దక్షిణ రాష్ట్రాల పర్యటన చేపట్టి ఉద్యమాన్ని మరింత విస్తృతం చేస్తామని వెల్లడించారు.

# హేమ దుర్గా భవన్‌లో ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

**కూకట్‌పల్లి ప్రతినిధి, జూన్ 19 (వన్‌నేషన్):** కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో హేమ దుర్గా భవన్ లో శుక్రవారం భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కేక్ కట్ చేసి రాహుల్ గాంధీ కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. దేశంలో ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ, సామాజిక న్యాయం, యువత సాధికారత కోసం రాహుల్ గాంధీ చేస్తున్న కృషిని నాయకులు కొనియాడారు.

కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ అధ్యక్షతన ఏ బ్లాక్ డబి అద్యక్షులు డాక్టర్ పి నాగిరెడ్డి, తూము వేణు ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని, రాహుల్ గాంధీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నాయకులు పిలుపునిచ్చారు.

అనంతరం మిఠాయిలు పంపిణీ చేసి జన్మదిన వేడుకలను ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు, నియోజకవర్గ



కాంగ్రెస్ సీనియర్ నాయకులు, బ్లాక్ అధ్యక్షులు, మార్కెటింగ్ కమిటీ సభ్యులు, టెంపుల్ కమిటీ సభ్యులు, డివిజన్ అధ్యక్షులు, బ్లాక్ మహిళా అధ్యక్షురాలు, డివిజన్ మహిళా అధ్యక్షురాలు, యూత్ కాంగ్రెస్, NSUI నాయకులు, మైనారిటీ నాయకులు, రాజ సెల్ నాయకులు, BC సెల్ నాయకులు, సేవాదళ్ నాయకులు, సోషల్ మీడియా,కార్యకర్తలు మరియు కాంగ్రెస్ పార్టీ అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని ఈ సమావేశాన్ని విజయవంతం చేసారు.

రాహుల్ గాంధీ కి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ పార్టీ నాయకులు ప్రజాసేవ పట్ల ఆయన నిబద్ధత స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

# రైతులకు అండగా కూటమి ప్రభుత్వం: ఎమ్మెల్యే బీ.వి

**ఎమ్మిగనూరు, జూన్ 19 (వన్‌నేషన్):** రైతులకు అండగా కూటమి ప్రభుత్వం నిలిచిందని ఎమ్మెల్యే డాక్టర్ బీ.వీ. జయ నాగేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కడిమెట్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో ఎమ్మెల్యే బీ.వీ రైతులకు ఆన్‌లైన్ విధానం ద్వారా ఎరువుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సహకార సంఘానికి సంబంధించిన ఎరువుల గోదామును ప్రారంభించారు. రైతుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి, ఓటీపీ విధానం ద్వారా పారదర్శకంగా ఎరువులను పంపిణీ చేయడం జరిగింది. అనంతరం సహకార సంఘం ఆవరణలో రైతులను ఉద్దేశించి ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభు త్వం ఏర్పడిన అనంతరం రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తూ అన్ని విధాలుగా రైతులకు అండగా నిలుస్తోందన్నారు. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో రైతుల అభ్యున్నతికి అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ, స్థానికంగా తెలుగుదేశం పార్టీ కార్యకర్తలపై దాడులు జరుగుతున్న నేపథ్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. అనంతరం గత నెలలో ఎర్రకోట గ్రామ పర్యటన సందర్భంగా గ్రామస్తులు చేసిన విజ్ఞప్తి మేరకు ఎల్ఎల్‌సీ కాలువను పరిశీలించారు.



కాలువకు అడ్డంగా ఉన్న మట్టి పిల్లర్లు, సిమెంట్ దిమ్మెలు, కట్టెలను తొలగించి నీరు సక్రమంగా పారేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే మీస్రా, WA-82, WA-83, WA-84 కాలువలను సందర్శించి, కాలువల ఇరువైపులా పెరిగిన కంపు చెట్లను తొలగించి నీటి ప్రవాహానికి ఎటువంటి ఆటంకం లేకుండా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కడిమెట్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు విరూపాక్షి రెడ్డి, మాజీ అధ్యక్షులు పార్లపల్లి చంద్రశేఖర్ రెడ్డి, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కేటీ వెంకటేశ్వర్లు, ఎమ్మిగనూరు వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు గౌస్ పీరా, డైరెక్టర్లు మురళీకృష్ణారెడ్డి, కేసన్న, స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# దేశ ప్రజల గొంతుకై నిలుస్తూన ప్రజా సేవకుడు మన రాహుల్ గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు

**కూకట్‌పల్లి ప్రతినిధి, జూన్ 19 (వన్‌నేషన్):** భారత్ జోడో యాత్ర ద్వారా కాంగ్రెస్ కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపి తెలంగాణ రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం తెచ్చి ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి ద్వారా తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చిన



రాహుల్ గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకొని కొండాపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో శేరిలింగంపల్లి నియోజకవర్గం మాజీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సౌందర్య రాజన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి నియోజకవర్గం కోఆర్డినేటర్ రఘునందన్ రెడ్డి,మరబోయిన అనిల్ కుమార్ యాదవ్,రాములు గౌడ్,డివిజన్ అధ్యక్షులు జహంగీర్,అలీ,నగేష్ నాయక్,నాయకులు కట్ల శేఖర్ రెడ్డి,రవీందర్ రెడ్డి,శామ్యూల్ కార్తీక్,విజయ్ భాస్కర్ రెడ్డి,పట్వారీ శశిధర్,మన్నేపల్లి సాంబశివ రావు,యలమంచి ఉదయ్ కిరణ్,నర్సింగ్ రావు,శివ, ఇస్మాయిల్,హరి కిషన్,యాదయ్య,వెంకట్ రెడ్డి,గఫూర్,యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు జాకీర్,జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్ ముదిరాజ్,యూత్ కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షులు మహేందర్,భాస్కర్ చారి,జయ సాయి,సతీష్,మహిళ కాంగ్రెస్ బ్లాక్ అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి,జయ,శాంత,అనిత తదితరులు పాల్గొనారు.

# నేతాజీ నగర్ లో శ్రీ సాయినాధుని 16వ వార్షికోత్సవ పూజా కార్యక్రమం

## పాల్గొన్న జోషి రాఘవేంద్ర శర్మ, బేరి రాంచందర్ యాదవ్

**కూకట్‌పల్లి ప్రతినిధి, జూన్ 19 (వన్‌నేషన్):** సాయినాధుని దీవెనలు ప్రజలకు కలగాలని పూజలు చేసిన బేరి రామచందర్ యాదవ్ గారెల వెంకటేష్ అమృత ముదిరాజ్ కుటుంబ సభ్యుల సహకారంతో అన్న సమారాధన కార్యక్రమం గచ్చిబౌలి డివిజన్ నేతాజీ నగర్ కాలనీ గుల్ మోర్ పార్క్ మన శ్రీ సాయి బృందావన క్షేత్రం 16వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా



నిర్వహించారు. ఉదయం నుండి ప్రత్యేక పూజ కార్యక్రమాలు ఆలయ ప్రధానార్చకులు జోషి రాఘవేంద్ర శర్మ ఆధ్వర్యంలో శ్రీశ్రీ మాధవ నంద సరస్వతి స్వామి వారికి పాదపూజ మధ్యాహ్నం 1గంటలకు అన్నదానం కార్యక్రమం అన్న సమారాధనకు సాయి ఫోటో స్టూడియో యజమాని, అమృత పతాంజలి యోగ గురువు గారెల వెంకటేష్ అమృత ముదిరాజ్ కుటుంబ సభ్యుల సహకారంతో నలుగురు దాతలు నేతాజీ నగర్ లో నిర్వహించారు. ఈ వేడుకల్లో బీసీ కులాల ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, కాలనీ అధ్యక్షులు బేరి రామచందర్ యాదవ్, ఆలయ ప్రధానార్చకులు జోషి రాఘవేంద్ర శర్మ పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కాలనీలోని భక్తులు అందరు సహ కుటుంబ సమేతంగా పాల్గొని శ్రీ గురుదత్త సద్గురు సాయినాధుని దర్శించుకున్నారని బీసీ కులాల ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బేరి రామచందర్ యాదవ్ తెలియజేశారు. స్వామివారిని దర్శించుకున్న బేరి రామచందర్ యాదవ్ మాట్లాడుతూ సకాలంలో వర్షాలు పడాలి పాడిపంటలు బాగుండాలి అందరూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఆనందంగా జీవించాలన్నారు. అందరూ ఐక్యమత్యంతో ఉండాలని భగవంతుని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ ఉపాధ్యక్షులు రాయుడు, నెహ్రూ నగర్ శ్రీకాంత్, నరసింహ, నాందేవ్, బీసీ కులాల ఐక్యవేదిక రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ సిరిపురం హరికృష్ణ చారి, నారాయణ, మహిళా సంఘం చిట్టెమ్మలాల్ రెడ్డి, సత్యమ్మ, వెంకటేష్ మేస్త్రి, మనోజ్ ముదిరాజ్, ఎన్ఎన్ రెడ్డి బోటిక్ టెక్స్టైల్స్ ప్రొప్రైటర్ కుషన్ రెడ్డి దంపతులు, మౌలానా, సాయి భక్తులు ఆగమయ్య గౌడ్, సతీష్, మరియు పెద్ద ఎత్తున సాయి భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. తీర్థ ప్రసాదాలు అన్న ప్రసాదం స్వీకరించారు.

# రాహుల్ గాంధీ పుట్టిన రోజు సందర్భంగా శేరి సతీష్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వ పాఠశాలలో కేక్ కటింగ్, పుస్తకాలు బిస్కెట్లు పంపిణీ

**కూకట్‌పల్లి ప్రతినిధి, జూన్ 19 (వన్‌నేషన్):** శుక్రవారం రాహుల్ గాంధీ పుట్టిన రోజు సందర్భంగా.. కూకట్పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డి నాయకత్వంలో బాలాజీ నగర్ డివిజన్ ప్రభుత్వ పాఠశాలలో కేక్ కటింగ్, పుస్తకాలు బిస్కెట్లు పంపిణీ కార్యక్రమం అంగరంగ వైభవంగా




జరిగింది.. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గొట్టిముక్కల జస్వంత్ రావు, కూకట్పల్లి నియోజకవర్గ మైనార్టీ ఫైనల్స్ కోఆర్డినేటర్ మేకల మేకలు, AMC డైరెక్టర్ పనింద్ర కుమార్, బాలాజీ నగర్ డివిజన్ ప్రెసిడెంట్ కృష్ణ రాజ్ పుత్, రాజేష్ గౌడ్, రాజు ముదిరాజ్, బాబ్జి కుమార్, మల్లి బాబు, కొమ్ము బాబు, వనజ, స్వాతి రెడ్డి, కోమలి, సరోజ, శ్రీధర్ చారి, గిరి నాయుడు, రామకృష్ణారెడ్డి, సూరిబాబు, జాన్ అన్న, బాలాజీ నగర్ డివిజన్ యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ కళ్యాణ్ బాబు, వసంత నగర్ డివిజన్ యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ ప్రసాద్ బాబు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మహిళా నాయకులు, యువజన విభాగం నాయకులు పాల్గొన్నారు.

# హైటెక్ సిటీలో అనుమానాస్పద నిర్మాణం..

## అధికారుల పరిశీలన కోరుతున్న స్థానికులు

**శేరిలింగంపల్లి, జూన్ 19 (వన్ నేషన్):** హైటెక్ సిటీ ప్రధాన రహదారిలోని ఎం.బి. సొసైటీ పరిసరాల్లో జరుగుతున్న ఒక నిర్మాణ పనిపై స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ప్లాట్ నెం.51, ఎం.బి. సొసైటీ, హైటెక్ సిటీ మెయిన్ రోడ్, ఖానమ్మెట్ ప్రాంతంలో నిర్మాణ కార్యకలాపాలు కొనసాగుతున్నాయని వారు తెలిపారు. స్థానికుల కథనం ప్రకారం, సంబంధిత నిర్మాణానికి అవసరమైన అనుమతులు ఉన్నాయా లేదా అనే విషయంలో స్పష్టత లేదని, అధికారులు వెంటనే తనిఖీలు నిర్వహించాలని వారు కోరుతున్నారు. నిర్మాణం నిబంధనలకు అనుగుణంగా జరుగుతోందా లేదా అన్న అంశంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత శాఖలు, ముఖ్యంగా జీహెచ్ఎంసీ (GHMC) మరియు టౌన్ ప్లానింగ్ అధికారులు స్థలాన్ని పరిశీలించి, నిర్మాణానికి సంబంధించిన అనుమతులు, మ్యాపులు మరియు ఇతర పత్రాలను ధృవీకరించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అయితే, నిర్మాణ నిర్వాహకుల వర్గం నుంచి ఈ ఆరోపణలపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక స్పందన వెలువడలేదు. అధికారుల విచారణ అనంతరం మాత్రమే నిర్మాణం చట్టబద్ధమైనదా కాదా అన్నది స్పష్టమవుతుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.




# ఎవరెస్ట్, విన్సన్ తర్వాత డెనాలీ శిఖరాన్ని జయించిన డా. రాజశేఖర్

## 'సెవెన్ సమిట్స్' సవాల్ పూర్తి చేసిన దక్షిణ భారతదేశపు తొలి వైద్యుడిగా అరుదైన ఘనత

**హైదరాబాద్, జూన్ 19 (వన్‌నేషన్):** హైదరాబాద్‌కు చెందిన ఆర్థోపెడిక్ సర్జన్, పర్వతారోహకుడు డా. రాజశేఖర్ ప్రపంచంలోని ఏడు ఖండాల్లోని అత్యంత ఎత్తైన పర్వత శిఖరాలను అధిరోహించే ప్రతిష్ఠాత్మక 'సెవెన్ సమిట్స్' సవాల్‌ను విజయవంతంగా పూర్తి చేశారు. తాజాగా ఉత్తర అమెరికాలోని అత్యంత ఎత్తైన శిఖరం మౌంట్ డెనాలీని అధిరోహించడం ద్వారా ఆయన ఈ అరుదైన ఘనతను సొంతం చేసుకున్నారు. దీంతో 'సెవెన్ సమిట్స్' పూర్తి చేసిన దక్షిణ భారత రాష్ట్రాలకు చెందిన తొలి వైద్యుడిగా చరిత్ర సృష్టించారు. డా. రాజశేఖర్ ప్రయాణం కేవలం పర్వతాలను జయించిన కథ మాత్రమే కాదు. తీవ్రమైన అనారోగ్యాన్ని అధిగమించి, జీవితాన్ని మళ్లీ కొత్తగా నిర్మించుకున్న వ్యక్తి సాధించిన అసాధారణ విజయగాథ ఇది. హిప్, మోకాలి శస్త్రచికిత్సల నిపుణుడైన ఆయన కోవిడ్ మహమ్మారి సమయంలో వైరస్ బారిన పడి ఆసుపత్రిలో చికిత్స పొందారు. కోలుకున్న తర్వాత కూడా అలసట, నీరసం వెంటాడడంతో దాదాపు ఏడాది పాటు వైద్య వృత్తికి దూరంగా ఉండాల్సి వచ్చింది. అయితే ఆ పరిస్థితులకు లొంగిపోకుండా తన ఆరోగ్యాన్ని తిరిగి సాధించాలనే లక్ష్యంతో పర్వతారోహణను ఎంచుకుని కఠినమైన శిక్షణ ప్రారంభించారు.



ఆయన 'సెవెన్ సమిట్స్' ప్రయాణం 2022లో టాంజానియాలోని కిలిమంజారోతో ప్రారంభమైంది. అనంతరం యూరప్‌లోని ఎల్బ్రస్, ఆస్ట్రేలియాలోని కోసియుస్కో, దక్షిణ అమెరికాలోని అకాంకాగ్వా శిఖరాలను అధిరోహించారు. 2024 మే 23న ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన ఎవరెస్ట్ శిఖరాన్ని చేరుకోవడం ఆయన జీవితంలో కీలక మైలురాయిగా నిలిచింది. డెనాలీపై తొలి ప్రయత్నం 2025లో విఫలమైనప్పటికీ ఆయన వెనుదిరగలేదు. ప్రతికూల వాతావరణం, ఫ్రాస్ట్‌బైట్ వంటి ఇబ్బందులను ఎదుర్కొన్నా మరింత పట్టుదలతో ముందుకు సాగారు. అనంతరం అంటార్కిటికాలోని విన్సన్ శిఖరాన్ని అధిరోహించి, చివరకు 2026 జూన్ 18న డెనాలీ శిఖరాన్ని విజయవంతంగా చేరుకుని తన కలను సాకారం చేసుకున్నారు.

# మర్రి శశాంక్ రెడ్డి ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ పుట్టినరోజు వేడుకలు

## మాతృదేవో భవ అనాధ ఆశ్రమంలో 150 మంది అనాదలకు విశేష అన్నదానం

**మహేశ్వరం, జూన్ 18, (వన్ నేషన్):** రాహుల్ గాంధీ పుట్టినరోజు సందర్భంగా నాదర్ గుల్ డివిజన్ లోని మాతృదేవో భవ అనాధ ఆశ్రమం లో మర్రి శశాంక్ రెడ్డి ఆధ్వర్యంలో అలాగే డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆశ్రమం లోని అనాదల తో రాహుల్ గాంధీ పుట్టినరోజు వేడుకలు జరుపుకోవడం జరిగింది. అలాగే 150 మంది అనాదలకు విశేష అన్నదానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో నాదర్ గుల్ డివిజన్ బడంగ్ పేట్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.






# దేశ ప్రగతి భవిష్యత్తు తరాల ఉన్నత స్థాయి పాలన జీవన విధానం కోసం ధర్నా

**ఇంద్ర పార్క్, జూన్ 19 (వన్ నేషన్):** దేశ ప్రగతిని భవిష్యత్తు తరాలను దృష్టిలో పెట్టుకొని ఉన్నత స్థాయి పాలన జీవన విధానం నడవాలనే ఉద్దేశంతో మంతెన శ్రీనివాసరాజు ఇందిరా పార్క్ ఎదురుగా ఉన్నటువంటి ధర్నా చౌక్ లో నిరసన వ్యక్తం చేశారు. ప్రధానమైనటువంటి నాలుగు అంశాలను తెరమీదకి తీసుకోవచ్చారు.



1.తెలుగు అధికార భాష అమలు చేయాలి అది ప్రజల హక్కు ప్రభుత్వ బాధ్యత అనేటువంటి అంశాన్ని ముందుకు తీసుకొచ్చి వ్యక్తి యొక్క భావనను సజావుగా తెలపగలిగేటువంటి శక్తి మాతృభాషకే ఉందని ఆ తరుణంలో ప్రతి కార్యకర్తలు మాతృభాషలో అందజేసినప్పుడే వ్యక్తికి అర్థమవుతుంది అనే భావనను వ్యక్తం చేశారు ఈ యొక్క అధికార భాష ప్రభుత్వ యంత్రాంగంలో కార్యాలయాలలో హైకోర్టు కింది కోర్టులలో జరిపే లావాదేవీలలో స్పష్టంగా తెలుగులో కూడా ఉండాలని ప్రధానమైనటువంటి డిమాండ్ గా సూచించారు.

2. ప్రజాస్వామ్య పరిరక్షణ ఎన్నికల సంస్కరణల కోసం ఇది ఒక వ్యక్తిగత రాజకీయ విమర్శ లేదు భావోద్వేగ పూరిత అభిప్రాయం మాత్రమే కాదు ఇది ఎన్నికల వ్యవస్థలో క్రమంగా పెరుగుతున్న అవినీతి రాజకీయ ప్రభావం డబ్బు మరియు మద్యం ఆధారిత ఓటు ప్రభావితరణ అధికార దుర్వినియోగం వంటి అంశాలపై ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం చేపట్టబడినా చైతన్య ఆత్మక నిరసన ఉద్యమంసమాచార హక్కు చట్టం కింద ఎన్నికల కమిషన్ కు సమర్పించిన ఫిర్యాదు విషయంలో ఉన్న అవకతవకలు గురించి మరొక అంశాన్ని తీసుకొని ధర్నా ప్రారంభించారు.

3. భారతీయ కుటుంబ వ్యవస్థ పరిరక్షణ అనే ఉద్దేశంతో మరొక అంశాన్ని తీసుకున్నారు సమాజంలో కోల్పోతున్న విలువలు విచ్ఛిన్నమవుతున్న కుటుంబ వ్యవస్థ పాశ్చాత్య ప్రభావం వల్ల కలిగే మార్పులు చూసి చూడనట్టు ఉంటున్న రాజ్యాంగ వ్యవస్థ చట్టం న్యాయవ్యవస్థ వీటన్నిటి ప్రభావం చేతనే దుష్పరిణామాలు జరుగుతున్నాయని దీని పై స్థాయిలో ఉన్న పెద్దలు సరిచేయాల్సిన అవసరం ఉందని తెలియజేశారు. అదేవిధంగా కుటుంబం బలంగా ఉంటేనే సమాజం బలంగా ఉంటుంది, కుటుంబం బలహీనమైతే సమాజం బలహీనమవుతుంది. కుటుంబం ఫలమైతే భారత్ బలమవుతుంది.

4.సరూర్నగర్ యజమానుల ధర్నా జిహెచ్ఎంసి తెలిసి చేసిన అధర్మంపై ప్రజా పోరాటాన్ని కొనసాగించారు, ప్రజల వద్ద పన్ను వసూలు చేస్తూ వారే అక్రమాలకు పాల్పడుతున్నటువంటి సందర్భాలను ఎండగట్టారు.

వీటిని సక్రమమైన విధానంలో తీసుకురావడానికి రాజ్యాంగ వ్యవస్థలు అయినటువంటి న్యాయ వ్యవస్థ ఎన్నికల కమిషన్ పరిపాలన వ్యవస్థ ఈ మూడిట్లో మార్పు జరిగితే ప్రజలకు మంచి జరుగుతుందని వాపోయారు.

అంతేకాకుండా పెద్దలు మనకు ఇచ్చినటువంటి స్వాతంత్రాన్ని 500 తరాలకు ఉపయోగపడేటువంటి విధివిధానాలతో ఏర్పాటు చేసుకుంటే కనీసం ఒక తరం పూర్తికాకముందే 70 సంవత్సరాల లోపే ఊహించినటు వంటి వినాశనం జరిగినది. వీటన్నిటికీ కారణమైనటు వంటిది రాజ్యాంగబద్ధమైన మూడు వ్యవస్థలు సరిగా లేకపోవడమే ఆ మూడు వ్యవస్థల్ని సరి చేసే దానిలో భాగంగానే తనలోని భావాలను వ్యక్తం చేస్తూ ధర్నాకు దిగారు. ఇందులో మంతెన శ్రీనివాస్ రాజు తో పాటు కడారి చంద్రశేఖర్ రెడ్డి, పొనగాని ఉపేందర్, ఆనంద్, యోగేశ్వర్ గురూజీ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా భావి భారత ప్రధాని రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

**- ప్రభుత్వ ఆసుపత్రిలో బాలింతలకు, గర్భిణీలకు, పాలు పండ్లు, బెడ్లు, పంపిణీ - స్థానిక గాంధీ సర్కిల్లో కేక్ కట్ చేసి,బాణాసంచా పేల్చి నుంచి సంబరాలు చేసుకున్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులు..**



**ఎమ్మిగనూరు, జూన్ 19 డి కాసిం వన్ నేషన్ ప్రతినిధి:** పార్లమెంట్ ప్రతిపక్ష నాయకులు,కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ 56వ పుట్టినరోజు వేడుకలను ఎమ్మిగనూరు పట్టణంలో కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ ఖాసిం వలి ఆధ్వర్యంలో స్థానిక గాంధీ విగ్రహం దగ్గర ఘనంగా కేక్ కట్ చేసి బాణసంచా పేల్చి,అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణీలకు, బాలింతలకు పాలు,బెడ్లు ,పండ్లు పంపిణీ చేసి జరుపు కున్నారు. దీనికి ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఆదోని మార్కెట్ యార్డ్ చైర్మన్ దేవి శెట్టి ప్రకాష్ హాజరయ్యారు.ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ దేశ ప్రజల సంక్షేమం భారత రాజ్యాంగ పరిరక్షణ,సామాజిక న్యాయం ,ప్రజాస్వామ్య విలువలు మరింత బలోపేతం కావాలంటే రాహుల్ గాంధీ ప్రధాని కావాలని తెలిపారు. పార్లమెంట్లో దేశ ప్రజల సమస్యలపై పోరాటం చేస్తున్న ఏకైక అగ్ర నాయకుడు రాహుల్ గాంధీని తెలిపారు.ప్రజలు రైతులు యువత విద్యార్థులు రాహుల్ వైపు నడుస్తున్నారని తెలిపారు.వచ్చే ఎన్నికల్లో దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రాహుల్ గాంధీ ప్రధాని రావడం ఖాయమని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వీరేష్ యాదవ్, షబ్బీర్ దేశాయ్, ముస్తఫా, కాసిం, గంజిల్లయ్య, నరసప్ప, రాజశేఖర్ ఆచారి,బనవాసి జైపాల్, నరసింహులు, తిక్కయ్య బ్దుల్ రహిమాన్, రఫిక్, తాయప్ప, హనుమన్న, తదితరులు పాల్గొన్నారు..



## ఎన్డీఏ కూటమి ఆధ్వర్యంలో రెండు సంవత్సరాల

# సుపరిపాలన, స్వర్ణాంధ్రప్రదేశ్ సభ విజయవంతమైంది

**-:టిడిపి ఇన్చార్జ్ ఎన్.రాఘవేంద్ర రెడ్డి,జనసేన పార్టీ ఇన్చార్జి వాల్మీకి బి. లక్ష్మన్న,బిజెపి ఇన్చార్జ్ ఎన్ విష్ణువర్ధన్ రెడ్డి**



**మంత్రాలయం, జూన్ 19 డి కాసిం వన్ నేషన్ ప్రతినిధి:** మంత్రాలయం నియోజకవర్గం మంత్రాలయం మండలం మాధవరం గ్రామంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెండేళ్ల సుపరిపాలన,స్వర్ణాంధ్రప్రదేశ్ సభ విజయవంతమైంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం రెండేళ్ల పరిపాలన పూర్తి చేసుకున్న సందర్భంగా టిడిపి ఇన్చార్జ్ ఎన్ రాఘవేంద్ర రెడ్డి,జనసేన పార్టీ ఇంచార్జ్ వాల్మీకి బి.లక్ష్మన్న,బిజెపి ఇంచార్జ్ ఎన్.విష్ణువర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో సభ జరిగింది.టిడిపి జిల్లా అధ్యక్షురాలు ఆది గుడిసె కృష్ణమ్మ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.సభను ఉద్దేశించి ప్రసంగించారు.సభ అధ్యక్షుడిగా అశోక్ రెడ్డి ఉన్నారు.ఈ సమావేశంలో మంత్రాలయం జనసేన పార్టీ ఇన్చార్జి వాల్మీకి బి లక్ష్మన్న మాట్లాడుతూ మన దేశ ప్రధాని నరేంద్ర మోడీ,మన రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు,రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కే.పవన్ కళ్యాణ్ నాయకత్వంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం రుణాంధ్రప్రదేశ్ నుంచి స్వర్ణాంధ్ర ప్రదేశ్ దిశగా పరుగులు పెడుతుందని అన్నారు.రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కే పవన్ కళ్యాణ్ గారి దగ్గర అత్యంత ముఖ్యమైన శాఖ పంచాయతీరాజ్ శాఖ ఉంది. ఈ పంచాయతీరాజ్ శాఖకు దేశంలోనే బెస్ట్ శాఖ అవార్డు వచ్చింది. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె పవన్ కళ్యాణ్,ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ఈ ముగ్గురు రాష్ట్రం కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారని అందువల్లనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధి దేశాల్లో పరుగులు పెడుతుందని అన్నారు.మంత్రాలయం టిడిపి ఇన్చార్జ్ ఎన్ రాఘవేంద్ర రెడ్డి గారు మాట్లాడుతూ మంత్రాలయం నియోజకవర్గంలో దాదాపు 350 కోట్ల రూపాయలు పైగా అభివృద్ధి కోసం ఖర్చు పెట్టామని నేను ఎమ్మెల్యేగా గెలవలేకపోయినా ఎక్కడ రాజీ పడకుండా మంత్రాలయం నియోజవర్గాన్ని అభివృద్ధి చేసి చూపించామని అన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే మంత్రాలయ నియోజక వర్గాన్ని కొంచెం కూడా అభివృద్ధి చేయలేదని రాఘవేంద్ర రెడ్డి అన్నారు. తాను చేసిన అభివృద్ధి కార్యక్రమాలు అన్నీ కూడా ఎన్ రాఘవేంద్ర రెడ్డి సభకు వివరించారు. టిడిపి యువ నాయకుడు మంత్రాలయం సింగల్ విండో అధ్యక్షుడు ఎన్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చేసిన అభివృద్ధి ఏమీ లేదని నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన బాల నాగిరెడ్డి గారు మంత్రాలయం నియోజకవర్గం ఏమీ అభివృద్ధి పరచలేదని ఆవేశంగా మాట్లాడారు. 2029 ఎన్నికల్లో టిడిపి తరఫున ఎమ్మెల్యే సీటు రాఘవేంద్ర రెడ్డి ని గెలిపించి చూపిస్తామని అన్నారు.కోసిగి మార్కెట్ యార్డ్ చైర్మన్ నర్సిరెడ్డి,ఎన్ విష్ణువర్ధన్ రెడ్డి,ఎన్ రమకాంత్ రెడ్డి,ఎన్ శశిరేఖ చావిడి వెంకటేష్, సురేష్ నాయుడు,ఆర్ లక్ష్మయ్య, వెంకటేశులు,టిడిపి సీనియర్ నాయకులు బస్సుల దొడ్డి ఈరన్న, మొదలగు వక్తలు అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రసంగించారు.జనసేన పార్టీ నాయకులు రామాంజనేయులు,చిన్న,బజార్ అప్ప ( అబ్రహం) సభను ఉద్దేశించి అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రసంగించారు.ఈ కార్యక్రమంలో టిడిపి నాలుగు మండలాల అధ్యక్షులు గోపాల్ రెడ్డి, మల్లికార్జున,పల్లిపాడు రామిరెడ్డి, సురేష్ నాయుడు జనసేన పార్టీ నాలుగు మండలాల అధ్యక్షులు బివి రవిచంద్ర,జి బజార్ అప్ప, వీరారెడ్డి,సుమిత్ర జనసేన పార్టీ సీనియర్ నాయకులు కౌతాళం రామాంజనేయులు,ఎస్ చిన్న, ఆలీ భాష, ఎస్ ఏ షోబు,చైర్మన్లు మారెప్ప,టిప్పు సుల్తాన్ టిడిపి నాయకులు ముత్తిరెడ్డి, అడివప్ప గౌడ్,నియోజకవర్గంలోని ముఖ్య నాయకులు కార్యకర్తలు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.ఎన్డీఏ కూటమి సభ సూపర్ సక్సెస్ అయిందని సభకు వచ్చిన ప్రతి ఒక్కరూ ప్రశంసించారు.



# మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా మెగా ఇంటీరియర్ డిజైన్ షో ప్రారంభం

**(1వ పేజీ తరువాయి)**

300 పైగా ప్రముఖ బ్రాండ్లు పాల్గొంటున్నాయి. ఈ ప్రదర్శన మూడు రోజుల పాటు ప్రతి రోజూ ఉదయం పది నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు సందర్శకుల కోసం తెరిచి ఉంటుంది. ఈ ప్రదర్శనను సందర్శించేందుకు దేశవ్యాప్తంగా దాదాపు ఇరవై ఐదు వేల మంది వస్తారని నిర్వాహకులు అంచనా. 'కార్పొరేట్ మీట్' – వ్యాపార ప్రముఖులు, తయారీదారులు, డెవలపర్లు, వాణిజ్య నిపుణులను ఒకే చోటికి చేర్చే ఒక ఫోరమ్. 'పెంబర్తి క్రాఫ్ట్ ఎక్స్‌పీరియన్స్' – తెలంగాణకు చెందిన ప్రతిష్ఠాత్మక లోహ కళాకృతులను (క్రాఫ్ట్), సమకాలీన ఇంటీరియర్ డిజైన్‌లో వాటి వినియోగాన్ని ప్రదర్శించే వేదిక ఇది. ఇవన్నీ ఆర్కిటెక్చర్, ఇంటీరియర్స్, నిర్మాణ రంగాన్ని ప్రభావితం చేస్తున్న సరికొత్త ట్రెండ్స్, సాంకేతికతలు, వినూత్న ఆలోచనలపై అవగాహనను కల్పిస్తాయి. ఈ సందర్భంగా ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంటీరియర్ డిజైనర్స్ హైదరాబాద్ రీజినల్ చాప్టర్ కోశాధికారి, 'షోకేస్ ఇన్‌సైడర్ ఎక్స్ 2026' కో-కన్వీనర్ ఆర్కిటెక్ట్ నవీన్ చలసాని మాట్లాడుతూ డిజైన్ రంగం భవిష్యత్తును సాంకేతికత, పర్యావరణ అనుకూలత, ఆవిష్కరణలే నిర్ణయిస్తాయన్నారు. ఈ సందర్భంగా ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంటీరియర్ డిజైనర్స్ హైదరాబాద్ రీజినల్ చాప్టర్ ఇమ్మీడియట్ పాస్ట్ చైర్‌పర్సన్ ఆర్కిటెక్ట్ పల్లవి అంచూరి మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలోనే అత్యంత ప్రభావవంతమైన డిజైన్ ఈవెంట్‌లలో ఒకటిగా ఇన్‌సైడర్ ఎక్స్ ఎదిగిందన్నారు. ఈ సందర్భంగా ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంటీరియర్ డిజైనర్స్ హైదరాబాద్ రీజినల్ చాప్టర్ చైర్‌పర్సన్-ఎలెక్ట్ ఆర్కిటెక్ట్ అమితా రాజ్ మాట్లాడుతూ ఈ మూడు రోజుల్లో దాదాపు ఇరవై ఐదు వేల మంది సందర్శకులు ఈ ప్రదర్శనను సందర్శిస్తారని అంచనా వేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంటీరియర్ డిజైనర్స్ హైదరాబాద్ రీజినల్ చాప్టర్ వైస్ చైర్‌పర్సన్ ట్రేడ్ రమేష్ పటేల్ మాట్లాడుతూ ఈ ప్రదర్శన డిజైన్ పరిశ్రమను సరికొత్తగా మారుస్తున్న వినూత్న ఉత్పత్తులు, మెటీరియల్స్, సాంకేతికతలను చాటి చెప్పుందన్నారు. ఈరోజు కార్పొరేట్ మీట్, ఐఐఐడీ ఫెలోషిప్ మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమాలు దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ ఆర్కిటెక్టులు, డిజైనర్లు, తయారీదారులు, పరిశ్రమ నిపుణులను ఒకే చోటుకు తీసుకు వచ్చింది. మరింత సమాచారానికి దయచేసి సంప్రదించండి : 9959154371 / 9963980259

# నిజాయితీతో కూడిన ఆలోచనలకు మద్దతు

**- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు - 'ఒకే సిటీ, ఒకే విజన్, అపార అవకాశాలు' అనే నినాదంతో హైదరాబాద్ ఎకనామిక్ ఫోరమ్ - ఐదు వందల మందికి పైగా హాజరు**



**హైదరాబాద్, జూన్ 19 (వన్‌నేషన్):** నిజాయితీతో కూడిన ఆలోచనలకు మద్దతు అందించనున్నామని ముఖ్య అతిథి ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డీ శ్రీధర్ బాబు తెలిపారు. ప్రపంచంలోని అగ్రగామి ఆర్థిక, ఆవిష్కరణల హబ్‌లలో ఒకటిగా నగరాన్ని బలోపేతం చేసే లక్ష్యంతో ఖాజాగూడలోని ఎస్ఏఎస్ ఐటవర్‌లో మొట్టమొదటి 'హైదరాబాద్ ఎకనామిక్ ఫోరమ్ 2026' నిర్వహించారు. 'ఒకే సిటీ, ఒకే విజన్, అపార అవకాశాలు' అనే నినాదంతో ఈ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'సరికొత్త ఆలోచనలతో తెలంగాణకు రండి. ప్రతి ఆలోచన విజయవంతమవుతుందని గ్యారెంటీ ఇవ్వలేకపోవచ్చు, కానీ నిజాయితీతో కూడిన ప్రతి ఆలోచనకు ఇక్కడ మద్దతు, అవకాశం, ఎదిగేందుకు కావాల్సిన నమ్మకం లభిస్తాయని హామీ ఇవ్వగలం' అని చెప్పారు. 20వ శతాబ్దం వనరులు, పరిశ్రమలు, పెట్టుబడుల కోసం పోటీ పడేవని, కానీ 21వ శతాబ్దం సరికొత్త ఆలోచనలు, ప్రతిభ, ఆవిష్కరణలను ఆకర్షించగల దేశాలదేనని అన్నారు. గత దశాబ్ద కాలంలో గ్లోబల్ ఇన్నోవేషన్ ఇండెక్స్ లో భారతదేశం 81వ స్థానం నుంచి 39వ స్థానానికి చేరడం, అద్భుతమైన వృద్ధిని సాధించడం ఈ ప్రపంచ మార్పును ప్రతిబింబిస్తోందని తెలిపారు. దేశంలో పెరుగుతున్న ఆవిష్కరణ సామర్థ్యాన్ని ఇది చెప్తుందన్నారు. ఈ పరివర్తనను ముందుండి నడిపించేందుకు తెలంగాణ దృఢ నిశ్చయంతో ఉందని చెప్పారు. ఈ రోజు భారతదేశం ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద స్టార్టప్ ఎకోసిస్టమ్‌గా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వ 'స్టేట్స్ స్టార్టప్ ర్యాంకింగ్స్'లో తెలంగాణ అత్యంత డైనమిక్ ఇన్నోవేషన్ హబ్‌లలో ఒకటిగా అవతరించిందన్నారు. 'టాప్ పెర్ఫార్మర్'గా గుర్తింపు పొందిందని తెలిపారు. ఐకామ్, తెలంగాణ డేటా ఎక్స్ఛేంజ్, స్టార్టప్‌ల కోసం రూ.1,000 కోట్ల ఫండ్ ఆఫ్ ఫండ్స్, ప్రతిపాదిత ఏఐ యూనివర్సిటీ, స్కిల్ యూనివర్సిటీ, 100 అడ్వాన్స్‌డ్ ఐటీఐల వంటి వినూత్న కార్యక్రమాల ద్వారా ఆవిష్కరణలను ప్రోత్సహించడమే కాకుండా, వాటికి అవసరమైన వసతులను కల్పిస్తున్నామని తెలిపారు. మా నిబద్ధత కేవలం స్టార్టప్‌లు, పరిశ్రమలకే పరిమితం కాలేదన్నారు. ఏఐ-ఎనేబుల్డ్ తరగతి గదులు, ఏఐ లిటరసీ మిషన్ ద్వారా భవిష్యత్తు ఆర్థిక వ్యవస్థకు అవసరమైన నైపుణ్యాలతో దాదాపు ప్రభుత్వ పాఠశాలలో ఉన్న ఇరవై లక్షల మంది విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నామని చెప్పారు. విద్య, పాలన, ఆవిష్కరణలు అంతర్భాగంగా ఉండేలా రాష్ట్రాన్ని నిర్మిస్తున్నామని వివరించారు.

ఈ సందర్భంగా ఎస్ఏఎస్ ఇన్‌ఫ్రా చైర్మన్ డాక్టర్ జీవీ రావు మాట్లాడుతూ సాంకేతికత, లైఫ్ సైన్సెస్, రిటైల్, రియల్ ఎస్టేట్, క్రీడలు, వినోదం వంటి పలు రంగాలలో ఏకకాలంలో రాణించగల సామర్థ్యం హైదరాబాద్‌కు ఉండటమే అసలైన బలమన్నారు. నగర భవిష్యత్తును తీర్చిదిద్దుతున్న అందరిని ఒక తాటిపైకి తీసుకురావడానికి, భవిష్యత్తులో అర్థవంతమైన చర్చలను మరింత ముందుకు తీసుకెళ్లడానికి ఈ ఫోరమ్ ఏర్పాటు చేశామన్నారు. ఈ సదస్సుకు ఐదు వందల మందికి పైగా వ్యాపార ప్రముఖులు, విధాన రూపకర్తలు, పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలు హాజరయ్యారు. భారతదేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక కేంద్రాలలో ఒకటిగా హైదరాబాద్ ఉంది. సాంకేతికత, వ్యాపార సంస్థలు, ఆవిష్కరణలు, పెట్టుబడులు, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలకు అంతర్జాతీయ గమ్యస్థానంగా అవతరించింది. ఈ ఫోరమ్ స్థిరమైన, సమగ్ర వృద్ధిని సాధించే లక్ష్యంతో పరస్పర సహకారం, వ్యూహాత్మక చర్చలు, ఆచరణాత్మక ఆలోచనలను పంచుకోవడానికి ఒక అద్భుతమైన వేదికగా నిలిచింది. 'హైదరాబాద్: భారతదేశ ఆవిష్కరణ రాజధానిగా ఎదుగుదల' అనే అంశంపై చర్చించారు. ఎకనామిక్ రీసెర్చ్, గ్లోబల్ అడ్వైజరీ, పాలసీ ఇంటెలిజెన్స్ అంశాల ఆధారంగా ఈ ఫోరమ్ నిర్వహించారు. రోజంతా జరిగిన వివిధ సెషన్లలో ఆర్థిక వృద్ధి & మార్కెట్ దృక్పథం, భవిష్యత్ అవసరాలకు తగ్గ మౌలిక సదుపాయాలు, డిజిటల్, ఏఐ పరివర్తన, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్స్, ఆవిష్కరణలు, పారిశ్రామికవేత్తలు, పెట్టుబడులు, మూలధనం వంటి అంశాలపై విస్తృతంగా చర్చలు జరిగాయి. అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలు, వ్యూహాత్మక పెట్టుబడులు, సహకార పర్యావరణ వ్యవస్థలు హైదరాబాద్ అభివృద్ధిని ఏ విధంగా వేగవంతం చేయగలవు అనే విషయాలను ప్రతినిధులు అన్వేషించారు.

నాలెడ్జ్ పార్టనర్ 'బోవర్ స్కూల్ ఆఫ్ ఎంట్రప్రెన్యూర్‌షిప్' సహకారంతో 'ఎస్ఏఎస్ ఇన్‌ఫ్రా' ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. హైదరాబాద్ నగరం భారతదేశంలోనే మొట్టమొదటి పూర్తి స్థాయి గ్లోబల్ రియల్ ఎస్టేట్ మార్కెట్‌గా అవతరించగలదా అనే అంశంపై జరిగిన చర్చలో నగరం విస్తృత ఆశయాలను వివరించారు. ఈ సదస్సులో మల్లారెడ్డి విశ్వవిద్యాలయం వైస్ చైర్పర్సన్ డాక్టర్ సీహెచ్ ప్రీతి రెడ్డి, లెఫ్టినెంట్ జనరల్ (రిటైర్డ్) సతీష్ దువా, లైఫ్ సైన్సెస్ ఏ ఫార్మా సీఈఓ సర్వేష్ సింగ్, నెక్స్‌వేవ్ సహ వ్యవస్థాపకుడు, సీఈఓ రాహుల్ అత్తులూరి, లామ్‌కాన్ ఫైనాన్స్ ఏ మేనేజ్‌మెంట్ సర్వీసెస్ డైరెక్టర్ డాక్టర్ అనిల్ లాంబా, 360డి స్పోర్ట్స్ ఫౌండింగ్ పార్టనర్ కార్తీక్ యనమండ్ర, ఏషియన్ సినిమాస్ వ్యవస్థాపకుడు సునీల్ నారంగ్, ఆక్సిమోరాన్స్ ఏ హాఫ్-ఎ-బావా హాస్పిటాలిటీ కన్సల్టెంట్స్ వ్యవస్థాపకుడు రెహాన్ గుహా, మృణాళిని రావు లగ్జరీ ఫ్యాషన్ లేబుల్ వ్యవస్థాపకురాలు ఏ క్రియేటివ్ డైరెక్టర్ మృణాళిని రావు తదితరులు పాల్గొన్నారు. 'బీట్రూట్ న్యూస్' వ్యవస్థాపకురాలు ఫే డిసౌజా కొన్ని సెషన్లకు వ్యాఖ్యాతగా వ్యవహరించారు. భారతదేశ తదుపరి వృద్ధి శకానికి, ఆవిష్కరణలకు, ప్రపంచ స్థాయి గుర్తింపునకు నాయకత్వం వహించడానికి హైదరాబాద్‌కు అన్ని అర్హతలు ఉన్నాయనే ఏకాభిప్రాయంతో ఈ కార్యక్రమం ముగిసింది. హైదరాబాద్ దీర్ఘకాలిక ఆర్థిక దృక్పథాన్ని, ప్రపంచ పోటీతత్వాన్ని పెంపొందించడానికి నాయకులను, విధాన రూపకర్తలను, ఆవిష్కర్తలను నిరంతరం ఒకే వేదికపైకి తీసుకువచ్చే ఒక నిరంతర ప్రక్రియకు ఇది నాంది పలికింది.

### ఎస్ఏఎస్ ఇన్‌ఫ్రా గురించి

ఎస్ఏఎస్ ఇన్‌ఫ్రా అనేది హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ, ప్రతిష్ఠాత్మక రియల్ ఎస్టేట్ డెవలపర్ సంస్థ. ఈ సంస్థ అల్ట్రా-లగ్జరీ నివాస సముదాయాలు, భారీ వాణిజ్య సముదాయాలు, లగ్జరీ రిటైల్ డెవలప్‌మెంట్ రంగాలలో చురుగ్గా దూసుకుపోతోంది. కోకాపేటలోని 'ఎస్ఏఎస్ క్రౌన్', ఖాజాగూడ/నానక్‌రామ్‌గూడలోని 'ఎస్ఏఎస్ ఐటవర్' వంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులు ఈ సంస్థ పరిధిలోనివే.

### బోవర్ స్కూల్ ఆఫ్ ఎంట్రప్రెన్యూర్‌షిప్ గురించి

'హైదరాబాద్ ఎకనామిక్ ఫోరమ్ 2026' సదస్సుకు 'బోవర్ స్కూల్ ఆఫ్ ఎంట్రప్రెన్యూర్‌షిప్' నాలెడ్జ్ పార్టనర్ గా వ్యవహరించింది. మరింత సమాచారానికి దయచేసి సంప్రదించండి : 9959154371 / 9963980259

Printed, Published and Owned by **K.YOUVARAJ** Published at H.No.16-1-427/1, MARUTHI NILAYAM, SAIDABAD, HYDERABAD-59. Printed at ALLAZ PRINTING PRESS H.No. 22-8-147, CHATTA BAZAR, HYDERABAD- 500002, Editor: **K.YOUVARAJ**, RNI No. APTEL/2010/33523, **E-mail: onenation014@gmail.com.**